# మృతదేహాల కోసం 18 గంటలా?

- ఎస్‌బీ ఆర్గానిక్స్ ప్రమాద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- మృతుల కుటుంబాలకు 50 లక్షలు, క్షతగాత్రులకు 25 లక్షలు ఇవ్వాలి
- యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి
- బాధిత కుటుంబాలకు హరీశ్‌రావు ఓదార్పు
- మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు అధికారుల ఏర్పాట్లు



సంగారెడ్డిలోని ఎంఎన్‌ఆర్ దవాఖానలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో బాధిత కుటుంబసభ్యులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. మృతదేహాల కోసం వారి కుటుంబీకులు 18 గంటలపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. మృతుల కుటుంబాలకు, క్షతగ్రాతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గురువారం హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింతా ప్రభాకర్, మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి ఎస్‌బీ ఆర్గానిక్స్ కంపెనీని సందర్శించారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని ఎంఎన్‌ఆర్ దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు. హరీశ్‌రావు ఎస్‌బీ ఆర్గానిక్స్ కంపెనీకి చేరుకోగానే ప్రమాద బాధితుల కుటుంబసభ్యులు ఆయన వద్దకు వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం తమను పట్టించుకోవడంలేదని, న్యాయం చేయాలని కోరితే పోలీసుల లాఠీలతో కొట్టి చెదరగొట్టారని చెప్పారు. మృతులు దయానంద్ భార్య మటిల్డా, సురేశ్‌పాల్ భార్య రాంబతి మాట్లాడుతూ.. తమ భర్తలు చనిపోయినట్టు కంపెనీ యాజమాన్యం కనీసం సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

**కలెక్టర్‌కు హరీశ్‌రావు ఫోన్**

ఘటనా స్థలం వద్ద నుంచే హరీశ్‌రావు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతితో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, మృతుల కుటుంబీకులను, క్షతగాత్రులను గాలికి వదిలేశారని అసంతృప్తి వ్యక్తంచేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని, ఆయా దవాఖానల్లో సైతం ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. హరీశ్‌రావు పరిశ్రమను సందర్శించిన తరువాత అధికారుల్లో కదలిక వచ్చింది. ఐజీ సుధీర్‌బాబు, ఎస్పీ రూపేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కంపెనీ యాజమాన్యంపై పోలీసు కేసు నమోదుచేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేయించి మృతదేహాలను కుటుంబీలకు అప్పగించారు. మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లుచేశారు. హరీశ్‌రావు సూచన మేరకు బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకర్ తదితరులు బాధిత కుటుంబాలకు అండగా నిలిచి అవసరమైన సహాయం అందజేశారు.

## రూ.41 లక్షల ఎక్స్‌గ్రేషియా

### ఎస్‌బీ ఆర్గానిక్స్ పేలుడు బాధితులకు పరిహారం

హత్నూర, ఏప్రిల్ 4: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమలో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయడానికి కంపెనీ యాజమాన్యం ఒప్పుకున్నట్టు టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.41 లక్షల చొప్పున.. నాలుగు కుటుంబాలకు ఆర్థికసాయం అందించడానికి అంగీకరించిందని తెలిపారు.

## రాహుల్ గాంధీ ఆస్తి 20 కోట్లు

### అఫిడవిట్‌లో వెల్లడి



*వయనాడ్, ఏప్రిల్ 4: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రెండోసారి పోటీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన ఆస్తులు రూ.20 కోట్లని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బుధవారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన తన నామినేషన్ దాఖలు చేశారు. రూ.9,24,59,264 చరాస్తులున్నట్టు తెలిపారు. అలాగే స్థిరాస్థుల విలువ రూ.7,93,03,977గా చూపించారు. అలాగే స్వీయ, ఆర్జిత ఆస్తులుగా రూ.9,04,89000గా పేర్కొన్న రాహుల్.. వారసత్వంగా వచ్చిన ఆస్తుల విలువ రూ.2,10,13,598గా తెలిపారు. అలాగే తనకు రూ.49,79,184 అప్పులున్నట్టు పేర్కొన్నారు. తన దగ్గర కేవలం రూ.55వేల నగదున్నదని తెలిపారు. 2019లో రాహుల్ ఆస్తుల విలువ రూ.15,88,77,000 కాగా.. 2014లో రూ.9.40 కోట్లు ఉండేది.*

## ఖర్గే, రేవంత్ మాదిగ జాతి ద్రోహులు

### ఎమ్మార్పీఎస్ నాయకుల ఫైర్

వనపర్తి జిల్లా కొత్తకోటలో నిరసన

కొత్తకోట, ఏప్రిల్ 4 : ఏఐసీసీ అగ్రనేత మల్లికార్జున్‌ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ జాతి ద్రోహులని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా నేతలు కొమ్ము చెన్నకేశవులు, కిరణ్‌మాదిగ విమర్శించారు. ఎంపీ టికెట్ల కేటాయింపులో మాదిగలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. గురువారం కొత్తకోట పట్టణంలోని చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నేతలను రాష్ట్రంలో అడుగడునా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మాలలతో కుమ్మక్కై మాదిగలను రాజకీయంగా అణచివేయాలని రేవంత్ చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీ ఎన్నికల్లో హస్తం పార్టీని భూస్థాపితం చేయాలని కోరారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

## వరంగల్ టికెట్ వంగపల్లికి ఇవ్వాలని వినతి

మషీరాబాద్, ఏప్రిల్ 4: వరంగల్ లోక్‌సభ స్థానంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగకు బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలని కోరుతూ సంఘం నేతలు గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు. వరంగల్ సీటు ఇస్తే మాదిగలమంతా గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్, కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ మల్లేశ్, గణేశ్, వేణు, నందిగామ నరసింహ, పాలడుగు శ్రీనివాస్, శివరాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు వరలక్ష్మి, అంజి, శాంతి, నరేశ్, రాజేందర్ తదితరులు ఆయనకు విజ్ఞప్తి చేశారు.




హైదరాబాద్‌లోని రాంనగర్ చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

## తెలంగాణలో కాంగ్రెస్‌ను సమాధి చేస్తాం

- ఎంపీ టికెట్లలో మాదిగలకు మోసం
- ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ నేతలు
- రాంనగర్‌లో ఖర్గే దిష్టిబొమ్మ దహనం

మషీరాబాద్, ఏప్రిల్ 4: మాదిగలకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో రాజకీయ సమాధి చేస్తామని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ నగర నాయకులు హెచ్చరించారు. మాదిగలకు కాంగ్రెస్ ఒక్క ఎంపీ సీటు కేటాయించకుండా మోసం చేసిందని ఆరోపిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ రాంనగర్ చౌరస్తాలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఖర్గేకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాదిగ, నగర నేతలు గండి కృష్ణ, ఇనుముల నర్సయ్య మాట్లాడారు. ఎస్సీల్లో నూటికి 70 శాతం ఉన్న మాదిగలకు కాంగ్రెస్ ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించకుండా ద్రోహం చేసిందని మండిపడ్డారు. మాదిగ ఉపకులాల నేతలకు టికెట్ ఇచ్చి కాంగ్రెస్‌లో ఇంతకాలం పనిచేసిన మాదిగ నేతలను పక్కనబెట్టి వంచించిందని ఆరోపించారు. మాదిగలను విస్మరిస్తే చంద్రబాబుకు ఏ గతి పట్టిందో భవిష్యత్తులో రేవంత్‌కూ అదేగతి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రవీందర్, మురళి, మహేశ్, నర్సింగరావు, రోషిన్ వినయ్, సాయిలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు మాదిగల సెగ

- పెద్దపల్లిలో గడ్డం వంశీపై వ్యతిరేకత
- వ్యూహకర్త హెచ్చరికతో అధిష్ఠానం అలర్ట్
- ఎమ్మెల్యేలతో మంత్రి దుద్దిళ్ల భేటీ
- ఊట్ల వరప్రసాద్‌కు రేవంత్ బుజ్జగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గం సెగ తగలనున్నదా? కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు ఇదే విషయంపై పార్టీని హెచ్చరించినట్టు తెలిసింది. రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వు నియోజకవకర్గాలు ఉండగా, వీటన్నింటినీ కాంగ్రెస్ మాల సామాజికవర్గం అభ్యర్థులకే కేటాయించింది. దీంతో తమకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని మాదిగ సామాజిక వర్గానికి చెందిన సొంత పార్టీ నేతలే బాహాటంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ నేరుగా ఇదే అంశంపై సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి లేఖ రాశారు. పెద్దపల్లి టికెట్ ఆశించిన మాదిగ నేతలు ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయం వద్ద చావు డప్పు కొట్టి నిరసన తెలిపారు. ఈ పరిణామాల పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం కలవరపడింది. ఈ అంశం ఎంపీ ఎన్నికల్లో ఏమైనా ప్రభావం చూపుతుందా? అనే కోణంలో ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు టీమ్ కూడా ఫ్లాష్ సర్వే నిర్వహించినట్టు తెలిసింది. పెద్దపల్లిలో ఈ అంశం పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ విజయావకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉన్నదని ఈ టీమ్ పార్టీకి నివేదిక అందజేసినట్టు తెలిసింది. పెద్దపల్లి పరిధిలో ఏండ్లతరబడి మాల సామాజికవర్గానికి చెందిన దివంగత జీ వెంకటస్వామి (కాకా) కుటుంబమే రాజకీయ పెత్తనం చెలాయిస్తున్నదని, ఆయన కుమారుడు వివేక్ పార్టీ అధికారంలో లేకపోతే పార్టీ మారడం, అధికారంలోకి రాగానే తిరిగి రావడం జరుగుతున్నదని అక్కడ మాదిగ సామాజిక వర్గం నేతలు ఆగ్రహంతో ఉన్నట్టు అధిష్ఠానానికి నివేదిక అందినట్టు సమాచారం. ఇప్పటికే కాకా కుమారులు వివేక్, వినోద్ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తాజాగా పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను కూడా వివేక్ కొడుకు వంశీకి ఇచ్చింది. దీంతో అక్కడ మాదిగ సామాజిక వర్గం నేతలు ఆగ్రహంతో ఉన్నారు. ఇదే విషయం ఫ్లాష్ సర్వేలో కూడా వ్యక్తం కావడంతో పార్టీ అప్రమత్తమైనట్టు తెలిసింది. దీంతో ప్రేమ్‌సాగర్ ఇంట్లో ఏర్పాటుచేసిన సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు హాజరై ఎమ్మెల్యేలతో చర్చించినట్టు తెలిసింది. వంశీ విజయావకాశాలు దెబ్బతినకుండా స్థానిక మాదిగ సామాజిక వర్గం నేతలను బుజ్జగించి దారికి తెచ్చుకునే బాధ్యత ఎమ్మెల్యేలదే అని మంత్రి దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. మరోవైపు, తనకు టికెట్ దక్కలేదని పెద్దపల్లిలో దీక్షకు ఉపక్రమించిన యూత్ కాంగ్రెస్ నాయకుడు ఊట్ల వరప్రసాద్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం బుజ్జగించారు. భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని సీఎం హామీ ఇవ్వడంతో వరప్రసాద్ దీక్ష విరమించుకున్నారు.


